www.methukuseema news

Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :01 | సోమవారం | 07 అక్టోబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy

పేజీలు :04 వేల :05

## ప్రకటన

సిర్గాపూర్ మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీ పోస్టుల్లో తాత్కాలిక ఉపాధ్యాయ, అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా జంతు శాస్త్రం-1, PGT తెలుగు, PGT మ్యాథ్స్, PGT సైన్స్ మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు ఆసక్తి గల మహిళ అభ్యర్థులు ఈనెల 21వ తేదీన RCO ఆఫీసులో జరిగే డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.




# పదేళ్ల నిర్మాణాలపై చర్చకు సిద్ధమా!

## ఎవరూ అడ్డుపడ్డా మూసీ సుందరీకరణ తప్పదు

ప్రతిపక్షాలు విమర్శలు కాదు.. సలహాలివ్వండి • బఫర్ జోన్లో ఉన్న ఇండ్లు తొలగిస్తాం.. • నిర్వాసితులను ఆదుకుంటామన్న రేవంత్ రెడ్డి • కేసీఆర్ కుటుంబం పేదలను రెచ్చగొడుతోంది • బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసింది • నోటిఫికేషన్లు ఇచ్చి నెలల కొద్ది వదిలేశారు • 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు ఇచ్చాం • ఈ నెల 9న 11,069 టీచర్లకు నియామక పత్రాలు • 1,635 మందికి నియామక పత్రాలు అందజేత • 'కొలువుల పండుగ' కార్యక్రమంలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరుతున్న యువతీ యువకులు తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. “ఇది ఉద్యోగం కాదు. ఒక భావోద్వేగం. ఉద్యోగాన్ని ఉద్యోగంగా కాకుండా ఒక బాధ్యతగా నిర్వర్తించాలి” అని ఉద్భోదించారు.ప్రజాపాలనలో కొలువుల పండుగ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అగ్రికల్చర్ ఆఫీసర్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్, లైబ్రేరియన్స్ తదితర 1635 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉద్యోగ నియామకాల పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం పలు అంశాలపై మాట్లాడారు.కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నప్పుడు ఎంతటి ఉత్సాహంతో చేస్తారో ఉద్యోగ విరమణ చేసే సందర్భంలో కూడా అంతే ఉత్సాహం ఉండేలా పని చేయాలి.ఎంతో మంది యువకుల బలిదానాలపైన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఆ బాధ్యతను గుర్తెరిగే అత్యంత ప్రాధాన్యతగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం.అధికారం చేపట్టిన 90 రోజుల్లో 30 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించాం. దసరా పండుగ శుభసందర్భంలో కుటుంబాల్లో ఆనందం నింపాలని 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నాం.తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఫోర్త్ సిటీ వంటి వాటిల్లో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారు భాగస్వాములు కావాలి.హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, హైకోర్టు, ఉస్మానియా హాస్పిటల్, అసెంబ్లీ భవనాల వంటి చారిత్రక కట్టడాలు, నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్, నిజాం సాగర్, హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ లాంటి గత ప్రాజెక్టుల వైభవాలను వివరిస్తూ కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న ఇంజనీర్లు అటువంటి నిర్మాణాల నాణ్యత, ప్రమాణాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.మురికి కూపంగా మారి విషం చిమ్ముతున్న మూసీని ప్రక్షాళన చేపట్టాం. గత నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే అనేక జీవితాలు మూసీలో మగ్గిపోయాయి. ఆ కుటుంబాలను బాగుపరిచేందుకు మంచి ఇళ్లు, వారి పిల్లలకు స్కూలు సౌకర్యాలు కల్పించే ఏర్పాట్లు చేస్తున్నాం.మూసీ ప్రక్షాళ కోసం గత ఆరు నెలలుగా 33 టీమ్‌లతో సర్వే చేయించాం. పేద వారి కష్టం నష్టం తెలిసిన వాడిగా నిర్వాసితులందరికీ మంచి జీవితం అందిస్తాం.ఈ కార్యక్రమంలో మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణలో రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు

- యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నమూనా విడుదల
- కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మంత్రులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు నెలకొల్పుతున్నామన్న భట్టి
- గత ప్రభుత్వం పేద విద్యార్థులను పట్టించుకోలేదన్న కోమటిరెడ్డి



2

## సీఎం రేవంత్ రెడ్డికి ఈటల బహిరంగ లేఖ

- మూసీ ప్రక్షాళనపై స్పందించిన ఈటల
- తాను పేదల కోసం కొట్లాడిన వ్యక్తినని వెల్లడి
- మూసీ ప్రక్షాళనను అడ్డుకోబోనని స్పష్టీకరణ
- కానీ పట్టా ఇళ్లలో ఉంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం



2

## ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం.

- కౌలు రైతులకూ అందని సాయం” అంటూ విమర్శ
- వందలాది మంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేదు
- ప్రభుత్వానికి బాధ్యత లేదని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు
- దసరా పండుగ వేళ.. వ్యవసాయాన్ని దండగలా మార్చింది



2

# తెలంగాణలో రూ.5 వేల కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు

హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థ నవీకరణకు కీలక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ లు నెలకొల్పాలని నిశ్చయించింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ కు 20 నుంచి 25 ఎకరాల స్థలం కేటాయించనున్నారు. ఇవాళ జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ మంత్రులు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ ల నమూనా విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రూ.5 వేల కోట్లతో ఈ స్కూల్ కాంప్లెక్స్ ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ ఏడాది నుంచే అన్ని నియోజకవర్గాల్లో స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు రాష్ట్ర ప్రజలకు దసరా కానుక అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో పేద విద్యార్థులను పట్టించుకోలేదని విమర్శించారు. చదువుకుంటే బాగుపడతారనేది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఈటల బహిరంగ లేఖ

హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ నేత, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగ లేఖ రాశారు. తాను పేదల అభ్యున్నతే లక్ష్యంగా కొట్లాడిన వ్యక్తినని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు అడ్డు తగలబోనని స్పష్టం చేశారు.అయితే, పట్టా ఇళ్లలో ఉంటున్న వారిని బఫర్ జోన్ పేరుతో అక్రమంగా నివాసం ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. పిడికెడు అక్రమ ఇళ్లను బూచిగా, రూ. కోట్ల విలువ చేసే ఇళ్లను కూలగొడుతున్నారని విమర్శించారు. "మమ్మల్ని కాలకేయులతో పోల్చడం మీకు సంస్కారమేనా? మూసీ నది ప్రక్షాళనకు మీ కార్యాచరణ ప్రణాళిక ఏంటి? డీపీఆర్ సిద్ధంగా ఉందా? ఇళ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం ఏమైనా చేస్తున్నారా? కోట్ల విలువైన ఇళ్లు కూలగొట్టి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామంటే ఎలా? ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించకుండా ఎలా కూల్చివేస్తారు?" అంటూ ఈటల సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్ భవిష్యత్ ను, అభివృద్ధిని ప్రశ్నార్థకంగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం

హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పొలం ఉన్న రైతులనూ పొట్టుబెట్టుకుంటున్నారని, కౌలు తీసుకున్న కర్షకులనూ కబళిస్తున్నారని, ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు బలికావడానికి ముమ్మాటికీ రైతు వ్యతిరేక రేవంత్ రెడ్డి సర్కారే కారణమని అన్నారు. "ఓవైపు సాగునీటి సంక్షోభం.. మరోవైపు రుణమాఫీ ద్రోహం.. ఇంకోవైపు రైతు భరోసా మోసం.. కౌలు రైతులకూ అందని సాయం" అంటూ విమర్శించారు. రైతుకు రక్షణ వలయంగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా ఎగ్గొట్టడంతోనే వ్యవసాయంలో ఈ విలయం నెలకొందన్నారు.వందలాది మంది రైతులు పిట్టల్లా రాలిపోతున్నా ఈ ప్రభుత్వంలో చలనం లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోయి లేదని.. ప్రభుత్వానికి బాధ్యత లేదని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దసరా పండుగ వేళ.. వ్యవసాయాన్ని దండగలా మార్చిందని.. సీఎం రేవంత్ రెడ్డికి రైతన్నల చేతిలో దండన తప్పదని అన్నారు. 'అన్నదాతలారా ఆత్మస్థైర్యం కోల్పోకండి..! ముంచే రోజులు పోతాయ్..!! మళ్లీ మంచి రోజులొస్తాయ్'..!!! జై కిసాన్ అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు.కాగా రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? ... రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? అని కేటీఆర్ ప్రశ్నిస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2500, అవ్వ, తాతలకు నెలకు రూ. 4000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? అని ప్రభుత్వంపై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.మూసీ సుందరీకరణ పేరిట రూ. లక్షన్నర కోట్లు లూటీకి తెరతీసిన ఘనుడు ఎవరు? అని ధ్వజమెత్తారు. ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకోవాల్నా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం..? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. బతుకమ్మ అంటే గిట్టదా..పట్టదా ఈ ముఖ్యమంత్రికి? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

# మోదీజీ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శంకించలేరు.. ప్రధానిపై రేవంత్ ఘాటు వ్యాఖ్యలు.



హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ అంటూ అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేసిందంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మహారాష్ట్ర ఎన్నికల ముందస్తు ప్రచారంలో భాగంగా రుణమాఫీపై ప్రధాని చేసిన ఆరోపణలను రేవంత్ రెడ్డి ఖండించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, ఆ విషయం మీరొచ్చి అడిగితే ఏ రైతు అయినా చెప్తారంటూ మోదీకి కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి ఘాటు లేఖ రాశారు."ప్రియమైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ.. తెలంగాణలో రైతుల రుణమాఫీ గురించి మీరు ప్రస్తావించారు. మేము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రుణమాఫీని విజయవంతంగా అమలు చేశాం. పథకం అమలు గురించిన వాస్తవాలను మీతో పంచుకోవాలని అనుకుంటున్నా. వాగ్దానం చేసిన విధంగా రూ.2లక్షల రుణాన్ని పూర్తిగా మాఫీ చేశాం. మొత్తం 22,22,067 మంది రైతులకు, రూ.17,869.22 కోట్లు వారి ఖాతాల్లో వేశాం. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఇదే అతిపెద్ద వ్యవసాయ రుణమాఫీ. రూ.2లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న రైతులు పైమొత్తాన్ని చెల్లించిన తర్వాత రుణమాఫీ అమలు చేస్తున్నాం. కాంగ్రెస్ గ్యారెంటీ గోల్డెన్ గ్యారెంటీ అని అన్నదాతలు నమ్ముతున్నారు. వారి సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ అంకితభావాన్ని మీరు శంకించలేరు. వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ సర్కార్ ఆదర్శ నమూనాగా నిలుస్తోంది. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని ప్రోత్సహించే ఈ ప్రయత్నంలో ప్రధానిగా మీ పూర్తి సహకారం, మార్గదర్శకత్వాన్ని నేను అభ్యర్థిస్తున్నా" అని పేర్కొన్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని పార్టీలు ప్రచార కార్యక్రమాలు చేపట్టాయి. ఈనెల మూడో వారంలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున్న రోడ్ షోలు, బహిరంగ సభలతో దూకుడు పెంచాయి. ఈ సందర్భంగా శివసేన(ఏక్‌నాథ్ షిండే వర్గం)- బీజేపీ- ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) సంకీర్ణ కూటమి తరపున ప్రధాని నరేంద్ర మోదీ గత శనివారం ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ సారథ్యంలోని మహా వికాస్ అగాఢీ కూటమిపై విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా ఎక్కడైనా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీలు ఇస్తుందని, ఒకవేళ గెలిస్తే మాత్రం వాటిని విస్మరిస్తుందంటూ ఆరోపించారు. అందుకు ఉదాహరణే తెలంగాణలో రైతు రుణమాఫీ అంటూ ప్రస్తావించారు. ఎన్నికల వేళ రుణ మాఫీ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఏడాది గడుస్తున్నప్పటికీ పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఏ రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ అలానే చేస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. దీనిపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాశారు.

# సికింద్రాబాద్ టు గోవా కొత్త రైల్వే సర్వీస్ ప్రారంభం



హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : సిటీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి గోవా వెళ్లాలనుకునే వారి సౌలభ్యం కోసం మరో రైలును ప్రారంభించింది రైల్వేశాఖ. ప్రస్తుతం సికింద్రాబాద్-వాస్కోడగామా మధ్య రెగ్యులర్ సర్వీసుకు (17603) తీవ్ర డిమాండ్ ఉండటంతో.. మరో ట్రైన్‌ను అందుబాటులోకి తెచ్చింది. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవాకు వెళ్లేలా సికింద్రాబాద్ %-% వాస్కోడిగామా రైలును.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వారంలో రెండు రోజుల పాటు ఈ సర్వీసు అందుబాటులో ఉంటుంది. సికింద్రాబాద్ నుంచి వాస్కోడిగామా (17039) వెళ్లే ట్రైన్ బుధ, శుక్రవారాల్లో అందుబాటులో ఉంటుంది. ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు వాస్కోడిగామా చేరుకుంటుంది. వాస్కోడిగామా నుంచి సికింద్రాబాద్?(17040)కు గురు, శనివారాల్లో అందుబాటులో ఉంటుంది. ఆయా రోజుల్లో అక్కడ ఉదయం 9 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 6.20 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.ఏటా సుమారు 80 లక్షల మంది స్వదేశీ పర్యాటకులు గోవాకు ట్రిప్స్ వేస్తుండగా.. అందులో 20 శాతం మంది తెలుగువారే ఉంటారు. అయితే హైదరాబాద్ నుంచి నేరుగా వెళ్లే రైలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్తున్నారు చాలామంది టూరిస్టులు. ప్రస్తుతం నేరుగా వెళ్లే రైలు అందుబాటులోకి వచ్చింది.కాచిగూడ, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్?నగర్, గద్వాల్, కర్నూలు సిటీ, డోన్, గుంతకల్, బళ్లారి, హొస్పేట, కొప్పల్, గడగ్, హుబ్బళ్లి, ధార్వాడ్, లోండా, క్యాసిల్ రాక్, కులెం, సాన్వోర్డెమ్, మడగావ్ స్టేషన్లలో ఆగుతుంది. ఇందులో ఫస్ట్ ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్?లు ఉంటాయి. ఈ నెల 4వ తేదీ నుంచి టికెట్ల బుకింగ్ చేసుకోవచ్చు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన.. పలుచోట్ల ట్రాఫిక్ జామ్



హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. బహదూర్‌పల్లి, సూరారం, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, నిజాంపేటలో వర్షం రికార్డు స్థాయిలో కురిసింది. మేడ్చల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, ప్రగతినగర్, గండిమైసమ్మ, గాగిల్లాపూర్‌లతోపాటు ప్యారడైజ్, చిలుకలగూడ, వారాసిగూడతో పాటు పలుచోట్ల వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రోడ్లపై భారీగా నీళ్లు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరోవైపు వాతావరణ కేంద్రం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌లో వాతావరణం మేఘావృతమై ఉంటుందని, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశాలున్నట్లు పేర్కొంది. ఉపరితల గాలులు ఈశాన్య దిశ నుంచి గంటకు ఆరు నుంచి పది కిలోమీటర్ల వేగంతో వీస్తాయని చెప్పింది.

**నేడు, రేపు వానలే వానలు.. ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ**

తెలంగాణలో నేడు, రేపు వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. సోమవారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

# రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడ?



న్యూఢిల్లీ,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : ప్రపంచంలో నేడు రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడుందని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ప్రశ్నించారు. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో మూడు రోజులు నిర్వహించిన కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్‌లో చివరిరోజైన ఆదివారం ఆయన ప్రసంగించారు. యుద్ధాలు జరుగుతుంటే ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రకే పరిమితమైందని, మార్కెట్‌లో మనుగడలేని ఒక పాత కంపెనీలాగా దాని తీరు ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు. సంక్షోభాలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోతోందని పేర్కొన్నారు. భద్రతామండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్యను పెంచడం సహా ఐక్యరాజ్యసమితిని సంస్కరించాలని గత కొన్నేళ్లుగా భారత్ డిమాండ్ చేస్తోంది.ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, హంగేరియన్-అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోసలలో ఎవరితో డిన్నర్‌కు ప్రాధాన్యం ఇస్తారనే ప్రశ్నకు జైశంకర్ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూ సందర్భంగా జైశంకర్‌ను ఈ విధంగా ప్రశ్నించగా.. 'ప్రస్తుతం నవరాత్రులు కదా!.. నేను ఉపవాసంలో ఉన్నా' అని నవ్వుతూ జైశంకర్ సమాధానం ఇచ్చారు. కాగా, జార్జ్ సోరోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తీవ్రంగా విమర్శిస్తుంటారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు జార్జ్ సోరోస్ నిధులు సమకూరుస్తున్నారని బీజేపీ తరచుగా ఆరోపిస్తోంది.

# జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాను వెనక్కి నెట్టేసిన బీఎస్ఎన్ఎల్

హైదరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : ప్రైవేటు టెలికం ఆపరేటర్లు అయిన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా (వీఐ)కి ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇటీవలి కాలంలో గట్టి పోటీ ఇస్తోంది. ఆ సంస్థలు తమ టారిఫ్ ధరలను ఎడాపెడా పెంచేయడంతో ఖాతాదారులు ఇప్పుడు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇటీవలి కాలంలో ఆ సంస్థ వినియోగదారుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. పాత వినియోగదారులు సైతం నంబర్ పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు. అతి త్వరలోనే బీఎస్ఎన్ఎల్ నుంచి దేశవ్యాప్తంగా 4జీ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం 5జీ సేవలు కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోంది. బీఎస్ఎన్ఎల్ తాజాగా తమ వినియోగదారుల కోసం మరో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. స్పామ్, అవాంఛిత వాణిజ్య ప్రకటనలు (యూసీసీ)పై ఫిర్యాదు చేసే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. మోసపూరిత ఎస్సెమ్మెస్‌లు, వాయిస్ కాల్స్‌పై బీఎస్ఎన్ఎల్ యూజర్లు ఇప్పుడు సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటి వరకు ఇలాంటి సదుపాయాన్ని దేశంలోని మరే టెలికం సంస్థ అందుబాటులోకి తీసుకురాలేదు.

# డంపింగ్ యార్డ్ మాకొద్దంటూ సమరానికి ప్రణాళిక బద్ధంగా సిద్ధమవుతున్న గ్రామ యువత

- పచ్చని పర్యావరణ అటవీ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి కలుషితం చేయొద్దు
- అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న వన్యప్రాణులకు డంపింగ్ యార్డ్ ఏర్పాట్లు వల్ల ప్రమాదం పొంచి ఉంది




గుమ్మడిదల,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) :పచ్చని పర్యావరణ అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసినట్లయితే వాతావరణ కలుషితంతో పాటు వ్యవసాయ ఆధారిత ప్రాంతం వివిధ రసాయన వ్యర్థాలతో కలుషితమవుతుందని గ్రామ యువత పర్యావరణ పరిరక్షణ కోసం ప్రణాళిక బద్ధంగా ఎదుర్కొనేందుకు అడుగులు వెయ్యనున్నామని అన్నారు ఆదివారం గ్రామ యువత సమావేశం ఏర్పాటు చేసుకొని మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధి ప్యారానగర్ పరిసర ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాట్లు నిరసిస్తూ పర్యావరణ పరిరక్షణ పోరాట సమితి పేరుతో అన్ని రాజకీయ పార్టీల కలయికతో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చెయ్యకుండా గ్రామస్థాయి నుండి యువత ప్రత్యేక ప్రణాళిక బద్ధంగా మండల జిల్లా ఉన్నతాధికారులకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకూడదని నివేదికలు ఇస్తూ నిలిపివేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యేంతవరకు పోరాటం చేస్తామని గ్రామ యువత ఏకతాటిపైకి వచ్చారు నేటి నుండే పర్యావరణ పరిరక్షణ పోరాట సమితి కమిటీ ఏర్పాటు చేసుకొని సంబంధిత శాఖ అధికారుల వద్దకు వినతులతో వెళ్తామని సూచించారు.

---

# యువత స్వయం ఉపాధి కల్పనకు ప్రభుత్వం సహకారం అందించాలి




గుమ్మడిదల,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : యువత స్వయం ఉపాధి కల్పనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని అప్పుడే యువత పక్కదారి పట్టకుండా కుటుంబ పోషణ బాధ్యత రైహి తంగా వ్యవహరిస్తారని ప్రోపరేటర్ నక్కిర్తి సుధాకర్ అన్నారు ఆదివారం ఎన్.ఎం.ఆర్ యువసేన మరియు తన కుటుంబ సభ్యులతో కలిసి గుమ్మడిదల టోల్గేట్ సమీపంలో డిలైట్ ట్రీట్ టీ పాయింట్, టిఫిన్ సెంటర్ షాపును ప్రారంభించారు కార్యక్రమంలో అంబుగారి బాలరాజు, పోతారం యాదగిరి, ఏడుకొండలు, నకీర్తి సుధాకర్, ఆంజనేయులు కుటుంబ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రజా సమస్యల పై పోరాడేది ఎర్రజెండానే

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం సమరశీల పోరాటాలు
- సిపిఎం ఆందోల్ ఏరియా మహాసభలో.. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్






ఆందోల్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే అని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సిపిఎం సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమెల మాణిక్యం అన్నారు. సిపిఎం ఆందోల్ ఏరియా మహాసభ శివంపేటలో జరిగింది ఈ మహాసభల సందర్భంగా పార్టీ ఎర్రజెండా ను ఆవిష్కరించిన అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ అగ్రనేత కామ్రేడ్ సీతారాం ఏచూరి బుద్ధదేవ్ భట్టాచార్య ఫోటోకు పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలక పార్టీలు ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేస్తూ గద్దెనెక్కినాక ప్రజలను మర్చిపోతున్నారని అన్నారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు రైతులు ఉద్యోగులు ప్రజలకు వ్యతిరేకంగా విధానాల ని అవలంబిస్తూ అంబానీ ఆదాని లాంటి కార్పొరేట్ల కు ఊడిగం చేస్తుందని అన్నారు ప్రభుత్వంపై వస్తున్న సంతృప్తిని సైడ్ చేయడం కోసం మతోన్మాద ఎజెండాను అమలు చేస్తుందని అన్నారు నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు పెద్ద ఎత్తున పెంచి సామాన్య ప్రజల పై భారాలు వేస్తుందని అన్నారు రాజ్యాంగం ప్రజాస్వామ్యం లౌకిక విలువలపై దాడి చేస్తుందని అన్నారు వీటిని ప్రజలు ఐక్యంగా చెప్పి కొట్టాలని కోరినారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు ప్రజలకు అండగా సిపిఎం ఎర్రజెండా ఉంటదని అన్నారు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి సాయిలు మాట్లాడుతూ పేదల భూములు గుంజుకొని పెద్దలకు అప్పచెబుతున్నారని అన్నారు ధరణిలో పేదల సైన్మెంట్ భూములకు నేటికీ అనేక గ్రామాలలో పట్టా పాస్ పుస్తకాలు రాలేదని అన్నారు పేదలకు భూములు పంచింది ఇళ్ల స్థలాల కోసం పోరాడింది కమ్యూనిస్టుల ఎర్రజెండానే అన్నారు కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నది సిపిఎం అన్నారు సమస్యల పరిష్కారానికి అందులో ఏరియా కన్వీనర్ డి విద్యాసాగర్ చౌటుకూరు మండల బాధ్యులు నాగభూషణం. సురేష్ రాములు ప్రభాకర్ శ్రీశైలం మహేష్ శీను పార్టీ సభ్యులు సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ క్షేమమేనా - పిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు



గజ్వేల్ రూరల్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనిపించడం లేదంటూ గజ్వేల్ పోలీస్ స్టేషన్ లో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు పిర్యాదు చేశారు. తొందరగా కేసీఆర్ ఆచూకీ తెలిపి నియోజకవర్గ ప్రజల ముందుకు తేవాలని వినతి పత్రం అందజేశారు అనంతరం గజ్వేల్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండారు శ్రీకాంత్ రావు మాట్లాడుతూ కెసిఆర్ మిరెక్కడా? వారం లోగా జాడ తెలవకపోతే, ఇక మేమే వెత్తుక్కుంటం,గెలిచి దాదాపు పది నెలలు కావోస్తున్న ఇప్పటికీ గజ్వేల్ నియోజకవర్గంలో మీ జాడలేదు, మి బాధ్యతల్ని మరిచవా కేసీఆర్ ప్రజల సొమ్ముని వేతనంగా తీసుకుంటున్నావు కదా నియోజకవర్గ ప్రజల కాలికి ముల్లు దిగితే పంటితో తీస్తనన్నావు కదా,మియోగ క్షేమాలు తెలుసుకోవాల్సిన బాధ్యత నిన్ను గెలిపించిన ప్రజల మీద ఉంది,పోలీస్ అధికారులు కేసీఆర్ ఆచూకీ తెలుసుకుని ప్రజలకు తెలపాలి, నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ పనులు అసంపూర్తిగా మిగిలాయి వాటిపై ఎవరు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి,పోలీస్ ల నుండి సమాచారం రాకపోతే కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని నేరుగా సందర్శించి యోగక్షేమాలు తెలుసుకుంటామన్నారు.

---

# ప్రభుత్వ భూములను కాపాడాలె

- ప్రభుత్వ భూమిలో రోడ్లు వేసిన - వెంచర్ యజమాలపై చర్యలు తీసుకోవాలి - సిపిఐ నాయకుల డిమాండ్..




నారాయణఖేడ్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు చిరంజీవి గణపతి.ఆదివారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడుతూ, నారాయణ నియోజకవర్గంలోని నాగల్ గిద్ద మండలంలో ప్రభుత్వ భూములలో నుండి హరితవనం ప్రైవేట్ వెంచర్ వాళ్ళు రోడ్డు వేసుకుని దర్జాగా వ్యవసాయ భూములను గుంటలు చొప్పున అక్రమదారిలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారని పేరుకున్నారు. ఇందుకు సంబంధించి రైతులు, పలువురు, ప్రభుత్వ అధికారుల దృష్టికి ఇటీ విషయాన్ని తీసుకువెళ్లిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారలకు ప్రభుత్వ అధికారులు వంతపారుతున్నట్టు ఆరోపనులు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధించి అధికారులు స్పందించి హరితవనం ప్రైవేట్ వెంచర్ ఓనర్ పై తగిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని వారు అంటున్నారు. కార్యక్రమంలో అశోక్,సతీష్,రాము సంజీవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

---

# పేదలందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ప్రభుత్వ ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి. - ప్రజా సమస్యలను విస్మరిస్తే పోరాటాలు తప్పవు - సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- కంది సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం.




సంగారెడ్డి (కంది ),అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తే ఎంతటి పోరాటాలకైనా సిపిఎం సిద్ధంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సిపిఎం పార్టీ కంది మండలం జనరల్ బాడీ సమావేశం కంది లో జరిగింది.ఇటీవల కాలంలో మృతి చెందిన పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారు మరియు వివిధ కారణాల చేత మరణించిన వారందరికీ జనరల్ బాడీ సమావేశంలో సంతాపాన్ని ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంది మండల కేంద్రంలో గత 20 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాలు లేక కిరాయిలు కట్టలేనటువంటి పరిస్థితుల్లో అనేకమంది పేదలు జీవితాన్ని కొనసాగిస్తున్నారని కాయకష్టం చేసి పొట్ట పోసుకునేటువంటి పేదలకు ఇంటికిరాయి గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కందిలో కొంతమంది ఆక్రమిస్తున్నారని బట్టి భూములను ప్రభుత్వం స్వాధీన పరుచుకుని పేదలకు ఇన్ని స్థలాలు ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల కంటే ముందు ఇచ్చినటువంటి హామీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇండ్లను నిర్మిస్తామని చెప్పిన హామీని వెంటనే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన అంశాలను తెచ్చి ఐక్యం కాకుండా విచ్ఛిన్నం చేయ చూస్తోందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటమే ఏకైక మార్గమని అయాన అన్నారు.ఇన్నేళ్ళ స్వతంత్ర భారతంలో ఇంకా మౌలిక వసతుల గురించి మాట్లాడే దౌర్భాగ్య స్థితిలో ఉండటానికి పాలకుల విధానాలే కారణం అన్నారు. దేశ రాజకీయాలు వ్యక్తుల చేతులలో నుండి కార్పొరేట్ కంపెనీల చేతులలోకి వెళ్లిందని,రాజకీయ కార్పొరేటికరణ జరిగి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ కే హాని జరిగే అవకాశం ఉందని అన్నారు. సంపదను కేంద్రీకృతం చేసి దేశాభివృద్ధిని వెనక్కి నెట్టేస్తున్న మతోన్మాదులకు వ్యతిరేకంగా దేశ సమగ్ర అభివృదికి సిపిఎం చేసే పోరాటాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. రైతు రుణ మాఫీలో రైతులు ఇంకా అయోమయంలో ఉన్నారన్నారు.రేషన్ కార్డులు,ఆసరా పెన్షన్‌లు, వెంటనే ఇవ్వాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంటి స్థలాల సమస్యలు,మురికి కాలువలు ,సరైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని అన్నారు. రైతులు, కూలీలు, అసంఘటితరంగ కార్మికులు,మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,యువజనులు, మహిళలు,దళితులు, మైనార్టీలు తదితరుల సంస్యలపై నికరమైన పోరాటాలు చేశామని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటమే ఏకైక మార్గమని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం. నరసింహులు,జిల్లా నాయకులు అశోక్,రాజయ్య, మండల కన్వీనర్ ఎన్.శ్రీనివాస్, రామ్ లక్ష్మణ్,రాం చందర్, రాజ మల్లయ్య, భరత్, రాజు, విజయలక్ష్మి,సంజీవ,నర్సింలు,ఆనంద్, సుజాత, షబానా, నసీమా,శేఖర్,మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# చనిపోయిన కుటుంబాలకు అక్షయ పాత్ర పౌండేషన్ లక్షల చొప్పున చెక్కులు




సంగారెడ్డి (కంది ),అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : జూలై 25 వ తారీఖు నాడు అక్షయపాత్ర ఉద్యోగానికి వస్తూ మార్గ మధ్యలో అకస్మాత్తుగా యాక్సిడెంట్ లో చనిపోయిన మూడు కుటుంబాలకు అక్షయ పాత్ర పౌండేషన్ నుండి ప్రతి కుటుంబానికి రెండు లక్షల చొప్పున చెక్కులను ఇప్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య బాబు జగ్జీవన్ రామ్ సమతా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు అక్షయపాత్ర యాజమాన్యం వినయ్ మధుసూదన్ కాంట్రాక్ట్ సుప్రవేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

---

# అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాన్ని బహిరంగంగా ఉరి తీయాలి

## - కురుమ సంఘం నారాయణఖేడ్ నియోజకవర్గం అధ్యక్షులు జిఎస్ ప్రభాకర్



నారాయణఖేడ్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో కడు పేద కుటుంబానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన హత్యాచార నిందితున్ని బహిరంగంగా ఉరి తీయాలని కురుమ సంఘం నారాయణఖేడ్ నియోజకవర్గం అధ్యక్షులు జిఎస్ ప్రభాకర్ కురుమ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. గురువన్నపేట గ్రామంలోని సామాజికంగా అభివృద్ధికి నోచుకోని కురుమ కులం గొర్ల కాపార్ల సామాజిక వర్గానికి చెందిన ఏడవ తరగతి చదువుతున్న, నీరు పేద కుటుంబానికి చెందిన మైనర్ బాలిక పై షరీఫ్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడటం మానవత్వం మంటగలిపే సంఘటన, నిందితున్ని తక్షణమే ఉరితీయాలన్నారు. ప్రభుత్వాలు ఎంత కఠిన చట్టాలు తీసుకొచ్చినా, ఇలాంటి మానవ మృగాలు ఎక్కడో ఒకచోట ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. ఇలాంటి మానవ మృగాలను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు.

---

# మద్దికుంట తండా నుండి తుల్జాపూర్ కు పాదయాత్ర



సదాశివపేట,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : సదాశివపేట మండలంలోని మద్దికుంట తండా నుండి తుల్జాపూర్ వరకు 230 కిలోమీటర్లు పాదయాత్ర పిఎసిఎస్ వైస్ చైర్మన్ పాండు నాయక్ ఆధ్వర్యంలో వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా పాండు నాయక్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి దసరా నవరాత్రి ఉత్సవాల భాగంగా ఈ సంవత్సరం కూడా తుల్జాపూర్ వరకు 230 కిలోమీటర్లు వారం రోజులపాటు పాదయాత్రగా వెళ్లడం జరుగుతుందని, గత జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికల్లో చింత ప్రభాకర్ గెలవాలని అమ్మవారికి మొక్కడం జరిగిందని, అమ్మ వారి ఆశీస్సులతో చింత ప్రభాకర్ విజయం సాధించారన్నారు, అక్కడికి వెళ్లి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేరు మీదుగా పూజలు చేయించి అమ్మవారిని దర్శించుకుని ముక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని మరియు సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి కోరుకోవడం జరుగుతుందన్నారు. ఈ పాదయాత్రలో దేవిదాస్, నవీన్, గణేష్, రమేష్ బృందంతో పాదయాత్రగా వెళ్లడం జరిగింది అన్నారు.

---

# నూజివీడు సీడ్స్ వారి ఆధ్వర్యంలో నవనీత్ పత్తి క్షేత్ర ప్రదర్శన




నారాయణఖేడ్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం శేల్గిర గ్రామ రైతు పాండు రెడ్డి పత్తి క్షేత్రానికి వచ్చిన రైతులతో నూజివీడు సీడ్స్ (ఏ ఎస్ ఎం ) పత్తి దిగుబడి గురించి జై కుమార్ మాట్లాడుతూ నవనీత్ పత్తి త్వరిత కాలపు పంట(145నుండి 150 రోజులు) అని,రసం పీల్చు పురుగును తట్టుకుని రైతులు మళ్ళీ రెండవ పంట వేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందని, పత్తి తీయటం సులువుగా ఉండటం వలన లేబర్ ఖర్చు తక్కువ అవుతుందని తద్వారా రైతు అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు.స్థానిక రైతు పాండు రెడ్డి మాట్లాడుతూ తన చేనులో ఒకో చెట్టుకు 60 నుండి 80 కాయలు ఉన్నాయని 12 నుండి 15 క్వింటాళ్ళు ప్రత్తి వస్తుందని వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులకు తన పత్తి పంటను చూపించారు.ఈ కార్యక్రమానికి చుట్టుప్రక్కల గ్రామాల రైతులు,గ్రామ పెద్దలు ఏరియా సేల్స్ ఆఫీసర్ సంగమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# చిన్న వయసులో తండ్రిని కోల్పోయిన చిన్నారి



చేర్యాల,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచనకోట గ్రామానికి చెందిన కొమ్ము కనకయ్య తన బ్రతుకుదెరువు కోసమని హైదరాబాద్ వెళ్లి అక్కడ తను కూలి పని చేసుకుంటూ,తన భార్య ఇళ్లల్లో పని చేసుకుంటూ కుటుంబం సాగించుకుంటున్నారు.శుక్రవారం రోజు ఎక్కడికి వెళ్లక ఇంట్లోనే ఉన్న కనకయ్య అకస్మాత్తుగా మరణించగా తన కుమార్తె చూసి తన తండ్రికి ఏమైందో తెలియక పక్కనే ఉన్న స్థానికులకు చెప్పి వారిని తీసుకురాగా చనిపోయాడని స్థానికులు ఆ చిన్నారికి చెప్పారు.స్థానికుల ద్వారా భర్త చనిపోయిన విషయం తెలుసుకున్న కనుకయ్య భార్య వెంటనే ఇంటికి వచ్చి తీవ్రంగా బాధపడుతూ ఏడ్చింది.అక్కడి నుండి తన స్వగ్రామానికి తీసుకువచ్చి ఆదివారం నాడు దహన సంస్కారాలు చేశారు.అక్కడి ప్రజలు వీరి బాధ చూడలేక వీరిని ప్రభుత్వం,ఇతర దాతలు ఆదుకోవాలని ప్రజలు కోరారు.

---

# కె.ప్రసాద్ రెడ్డి సేవలు అభినందనీయం

## - కాంగ్రెస్ నేత మాజీ మంత్రి జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ.చంద్రశేఖర్




జహీరాబాద్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహిర్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కె.ప్రసాద్ రెడ్డి వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఆదివారం కోహీర్ మండలంలోని పిచేర్యాగడి తాండ(ఎ) లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు శిలాఫలకాన్ని మాజీ మంత్రి జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్,ముఖ్య అతిథిగా హాజరైన టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పుట్టి పెరిగిన ప్రాంతానికి స్వంతంగా సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం స్పూర్తిదాయకమని, ప్రశంశనియమని అన్నారు. సమజంలో మనం చేసే సేవా కార్యక్రమాల వల్లనే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు.పిచేర్యగడి తాండ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా అని,గ్రామంలో వక్ఫ్ భూముల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువేళ్ళీ సమస్యను పరిష్కారిస్తాం అని అన్నారు.గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మిస్తాం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామలింగారెడ్డి,కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షద్,యేసు, మొగుడంపల్లి మండల అధ్యక్షులు మక్షుద్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు హుగ్గేల్లి రాములు, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు,కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్,మాజీ ఎంపీపీ షౌకత్ అలీ,మాజీ వైస్ ఎంపీపీ షాకీర్ అలీ, ఐఎన్.టీయుసీ.ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు రాజ్ కుమార్,కాంగ్రెస్ నాయకులు మోసిన్,కోహీర్ టౌన్ ప్రెసిడెంట్ శంషిర్ అలీ, ముర్జల్,యూత్ కాంగ్రెస్ నాయకులు ముజేమ్మిల్, సురేష్,లాజర్,సాంసన్,తాండ నాయకులు మంగు,నర్సింగ్, విజేందర్,మేఘునాథ్,సూసైటీ డైరెక్టర్ లస్కార్ నాయక్,మాజీ షేవ్య,రవి,రాథోడ్ సంజీవ్ కుమార్,రమేష్,సునీల్,కిషన్,తదితరులు పాల్గొన్నారు.

---

# బతుకమ్మ చీరలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

## - మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి



న్యాల్కల్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల్ మల్గి తాజా మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి ప్రకటనలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఆడబిడ్డలు కోసం ప్రతి ఏటా కోటి బతుకమ్మ చీరల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని అన్నారు పండుగ సమీపిస్తున్న ఇప్పటి వరకు చీరల పంపిణీ ఊసే లేదని అన్నారు.

---

# కాంగ్రెస్ నాయకులు గోపాల్ నాయక్ ను పరామర్శించిన మాజీ మంత్రి వర్యులు డాక్టర్ ఎ. చంద్రశేఖర్



కోహీర్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కోహీర్ మండలంలో పిచేర్యాగడి తాండ (ఎ) లో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకులు గోపాల్ నాయక్ ను మాజీ మంత్రి డాక్టర్ ఎ. చంద్రశేఖర్ పరామర్శించి, త్వరగా కోలుకుంటారు అని ధైర్యంగా ఉండాలని అన్నారు.

---

# భవాని మాత ని దర్శించుకున్న జి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బప్ప మచ్చేందర్



నారాయణఖేడ్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : వారితో పాటు జి ఎం ఆర్ ఫౌండేషన్ సభ్యులు నారాయణఖేడ్ తాజా మాజీ జడ్పీటీసీ ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్ సి , ఎస్ టి విజలేన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాథోడ్ లక్ష్మి బాయి రవీందర్ నాయక్, నారాయణఖేడ్ మాజీ ఏ ఎం సి వైస్ చైర్మన్ ఏం ఏ బాసీత్, కృష్ణపూర్ తాజా మాజీ ఎంపీటీసీ సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పరి అంజయ్య,ర్యాలమడుగు తాజా మాజీ ఎంపీటీసీ ఆమ్ర్య నాయక్, కృష్ణపూర్ తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి,నారాయణఖేడ్ గీతా సహకార సంఘం డైరెక్టర్ శంకర్ గౌడ్, అనుముల తుకారం,జగతి రాజు, పండరి ముదిరాజ్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

---

# రోడ్డు మరమ్మత్తుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు



టేక్మాల్,అక్టోబర్ 07 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలో ఉన్న దన్నారం గ్రామంలో రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా మారింది ప్రభుత్వాలు మరినా పాలకులు మారిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టు మారంది వివరాల్లోకెళ్తే దన్నారం గ్రామంలో నుండి రెండు కిలోమీటర్ల పొడవున్న రోడ్డు గుంతలు మయంగా మారింది ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ బురద,కంకర గ్రామ ప్రజలు మా బాధ ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు, ఈ దన్నారం గ్రామ ఊరి మధ్యలో నుండి పటాన్చెరు వయా దన్నారం టేక్మాల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదు ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేయాలని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేనికి తోడు ఆడపడుచుల ఎంతో సంబరంగా జరుపుకునే బతుకమ్మ పండగ, ఈ రోడ్డు మార్గలో తిరిగే వాహనదారులు ప్రభుత్వ ఉద్యోగులు ఎంతోమంది ప్రయాణం చేస్తూ ఉంటారు రోడ్డు గుంతల నుండి బయటపడటానికి ప్రజలు రోడ్డుతో యుద్ధం చేస్తున్నారు ప్రజలు ఇన్ని ఇబ్బందుల పాలవుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు కూడా లేదు అని స్థానికులు వాపోతున్నారు ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేయాలని వేడుకున్నారు

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com